# పుత్రోత్సాహం

**మెడికల్ కాలేజీ గ్రౌండ్ చాలా సందడిగా ఉంది. ఎటువైపు చూసినా జనసందోహం. కాబోయే డాక్టర్లు, వారి తల్లిదండ్రులు, బంధువర్గం, కాలేజీ స్టాఫ్... ఇంకా ఎంతోమందితో కళకళలాడుతోంది.**

క్రమంగా దట్టంగా మారుతున్న సాయంకాల చీకటి తెరలని పారద్రోలుతూ, పున్నమిచంద్రుడు తన చిరునవ్వులతో వెలుగులు పరుస్తున్నాడు. శరీరాల్ని ఉల్లాసపరుస్తూ వీస్తున్న వింజామరలా పిల్లతెమ్మెరలు.

ఎటుచూసినా ఉత్సాహం... వెరసి మనసులకు ఆహ్లాదం.

వేదిక అద్భుతంగా అలంకరించబడి ఉంది.

సరిగ్గా ఏడు గంటలకి ముఖ్య అతిథిగా రైన ఆరోగ్యశాఖ మంత్రిగారు విచ్చేశారు. కాలేజీ వార్షికోత్సవ కార్యక్రమం మొదలైంది.

ఎవరెవరో మాట్లాడుతున్నారు. నివేదికలు, నివేదనలు సమర్పిస్తున్నారు.

సమయం చకచక గడుస్తున్నా, నాకెందుకో భారంగా అనిపిస్తోంది. ఎందుకో ఏమిటి? ఎదురుచూపుల్లో క్షణమొక యుగం కదా!

ఏమైతేనేం.. అనుకున్న సమయం వచ్చేసింది.

ప్రిన్సిపాల్‌గారి ఉపన్యాసం పూర్తి అయ్యాక తదుపరి కార్యక్రమం అనౌన్స్ చేశారు.

ఆ కళాశాల చరిత్రలోనే కాక మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోని వైద్య కళాశాలలన్నింటిలో, పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన 'వివేక్'ని వేదిక మీదకి సాదరంగా ఆహ్వానించారు.

వివేక్ లేచి వెళ్తుంటే, ఆ ప్రదేశమంతా చప్పట్లతో మారుమోగిపోయింది.

వినమ్రంగా అందరికీ ప్రణమిల్లి, మంత్రిగారి పక్కన కేటాయించిన ప్రత్యేక ఆసనం మీద కూర్చున్నాడు వివేక్.

సన్మాన కార్యక్రమం మొదలైంది. దుశ్శాలువతో సత్కరించారు. తలకి కిరీటం తొడిగారు. భారీ జ్ఞాపికను బహూకరించారు. తోటి సహాధ్యాయులు, అధ్యాపకులు, ఇతరులు అతడి గొప్పతనాన్ని, ఇక ఇంతకన్నా పొగడ్తలు మిగలలేదేమో అన్నంతగా కొనియాడారు.

చివరిగా తన కృతజ్ఞతలు చెప్పుకోవలసిన తరుణం వచ్చింది వివేక్‌కి. మరోసారి అందరికీ నమస్కరించాడు. సమాజంలో డాక్టర్ల పాత్రని నిర్వచిస్తూనే, తన భవిష్యత్ ప్రణాళికలేమిటో, ప్రాధాన్యతలేమిటో విశదీకరించాడు. ప్రస్తుత మెడికోలకి తగు సూచనలిచ్చాడు.

ఆ తర్వాత..

అతడు వెల్లడించిన నిజం అక్కడున్న వారందరినీ స్థాణువుల్ని చేసింది.

"అవును.. ఈ రోజు నాకు జరుగుతున్న ఈ సన్మానం, ఈ గౌరవం పూర్తిగా నా తల్లిదండ్రులకే దక్కాలి. నా ఉన్నతికి, ఉత్తమ వ్యక్తిత్వానికి కారణం వారే. నేను చెబుతున్న మాటలు మీకు కొత్తగా అనిపించకపోవచ్చు. పిల్లలు గొప్పవారైతే, ఆ ఘనత కన్నవారికే చెందుతుంది సహజంగా. కానీ..."

ఒక్క క్షణం మాట కోసం ఆగాడు వివేక్. అతడేమి చెప్పబోతున్నాడోనని అందరిలోనూ ఆతృత.

అతడు కొనసాగించాడు.



"నా తల్లిదండ్రులు నన్ను కన్నవాళ్లు కాదు. ఏ కారణంగానో, కడుపున నవమాసాలు మోసిన తల్లికి భారమై, పచ్చిగుడ్డుగా, మురికికాలువ పక్కన, చెత్త తొట్టెలో, ఎంగిలాకుల నడుమ పడి, ఏ క్షణాన్నైనా వీధికుక్కలకి ఆహారంగా మారాల్సిన నన్ను చూసి, అక్కున చేర్చుకున్న నాన్న రఘుపతి గారు. కులమేదో, మతమేదో తెలియకపోయినా, బంధుమిత్రులు ఎన్ని నిందలు వేసినా, పేగుబంధాన్ని మించి ఆదరించిన అమ్మ సరోజినిగారు.. నా సత్కారం వారికే చెందాలి. వారికే అందాలి"

వివేక్ తన తల్లిదండ్రుల్ని వేదికపైకి పిలిచి, సభకు పరిచయం చేశాడు. వారిద్దరి కళ్లల్లో ఆనందభాష్పాలు.

గొంతు రుద్ధమైపోతుంటే ఎలాగో తమాయించుకుని, నోరు విప్పగలిగాడు రఘుపతి.

"మిత్రులారా.. ఇందులో ఏదో గొప్పతనం ఉందని మేమనుకోవడం లేదు. మనిషిగా పుట్టినందుకు, మానవతా ధర్మంగా, మరో మనిషికి జీవితాన్నివ్వగలిగే అదృష్టం మాకు కలిగింది. దానిని నాకు కల్పించిన మహనీయుడు మరో వ్యక్తి. అతడు.. నా తండ్రిగారు కైలాసమూర్తిగారు. అతడిని మీకు పరిచయం చేస్తాను"

వచ్చినవారంతా నలుదిక్కులా చూస్తున్నారు. ఆ కైలాసమూర్తి ఎవరా అని, ఎటువైపు నుండి వస్తారా అని వారికిదంతా విచిత్రంగా ఉంది.

నేను లేవబోయాను. ఈ ఎనభై ఐదేళ్ల వయసు నా శరీరానికి తగిన సహకారం అందించలేదు. నా అవస్థ గమనించిన ఇద్దరు యువతరం ప్రతినిధులు ఆసరాగా నిలచి, స్టేజి మీదకి నడిపించుకుపోయారు. మనుషులు మసక మసకగా కనిపిస్తున్నా, చెవులు స్పష్టంగానే వినిపిస్తున్నాయి.

"దాదాపు పాతికేళ్ల క్రితం, చాలా హీనమైన దుస్థితిలో దొరికిన బిడ్డని ఏ అనాథాశ్రమానికి తరలించాలని, తర్జన భర్జన పడుతున్న నాకు ఈ తండ్రే దారి చూపించారు. కేవలం కంటేనే పిల్లలు కారని, అనురాగం పంచితే ఏ బిడ్డయినా సొంత బిడ్డేనని నాకు ధైర్యం నూరిపోశారు.

అప్పటికే లెక్కకు మించిన జనాభాతో, అవసరాలు పెంచేసుకుంటున్న అవినీతితో విలవిలలాడుతున్న దేశానికి, భవిష్యత్తులో ఏ అరాచక శక్తిగా మారుతాడో తెలీని అనాథని అదనంగా ఇచ్చే బదులు, అతడిని సచ్ఛీలుడిగా దేశం గర్వించే పౌరుడిగా తీర్చిదిద్దమని నా కర్తవ్యాన్ని బోధించారు. మా బంధుజనులు ఎంత నిష్టూరమాడినా, నిందించినా ధైర్యంగా నిలబడిన నా సహధర్మచారిణిని కూడా అభినందించాలి" రఘుపతి తన భార్యతో వచ్చి సభాముఖంగా నా పాదాలకి మ్రొక్కాడు.

నాలో ఉత్సాహం ఉప్పెనలా పొంగుతోంది. గొంతు తడబడుతున్నా, నేను మాట్లాడడానికే నిర్ణయించుకుని, మైకు అందుకున్నాను.

"దారిప్రక్క పసివారిని ఆదుకోవడం త్యాగం అని నేననుకోను. అది మన ధర్మం. మనకు చేతనైనంతలో ఆ ధర్మాన్ని నిర్వర్తిద్దాం. ఒక మనిషి వ్యక్తిత్వం ఉన్నతంగా రూపుదిద్దడానికి అతడి కులమో, మతమో, వెనుక ఉన్న ఆస్తిపాస్తులో కారణం కాదు. పెద్దవారి పెంపకం... వారు నూరిపోసిన సంస్కారం... అందించిన మనోబలం"

పుత్రోత్సాహం నాలో ఈనాడు రెట్టింపయింది. రఘుపతి కూడా ఈరోజు పుత్రోత్సాహాన్ని ఆస్వాదిస్తున్నాడు.

"నాకు తెలుసు.. మీ యువతలో ఆదర్శభావాలు మెండుగా ఉన్నాయి. వాటిపై నీళ్లు జల్లడానికి పరిస్థితులు నాలుగువైపులా కాచుకుని ఉంటాయి. అలాంటి సమయంలోనే మీకు పెద్దవారి ప్రోత్సాహం కావాలి. ఒక మంచి మాట మీలో ఉత్తేజం నింపుతుంది. ఉన్నత బాటలో పయనించే శక్తినిస్తుంది. మనిషికి మారుపేరుగా మీరు మున్ముందుకు సాగిపోవాలని ఆశీర్వదిస్తున్నాను. శెలవు"

చిన్నా పెద్ద అందరి చప్పట్లతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోతోంది. ఆ చప్పట్లలో నిజాయితీ కొన్ని హృదయాలనైనా తప్పక కదిలిస్తుంది.

**-సి.వి.నరసింహదాసు (కోల్‌కటా)**